# ఓం. మ. క్రీ

రచయిత :

భాస్కర్ బి. హెచ్చి

అఖిల భారత ఓం. మ క్రీ. సంఘ సర్వ సభ్య సమావేశము క్రిందటి నెల మూడవ తారీఖున కొల్లేటి ప్రాంతములోని ఒక పెద్ద మఱ్ఱిచెట్టుక్రింద జరుపబడినది. ఆఱు సంవత్సరాలుగా అజ్ఞాతంలోనున్న శ్రీ హుస్సేన్ శాస్త్రి గారు తమ కృపా కటాక్ష వీక్షణాలను సభ్యులపై బఱపి సభకు అధ్యక్షులుగా నుండుటకు దయతో అంగీకరించిన కారణంగా ఈ సభ అతి రహస్యముగా జరుపబడినది. సభ్యులు గానివారికి ఇందులో ప్రవేశములేదు. (షరా:— నేను నమ్మకస్థుడని మీరు గ్రహించాలి) సభ రాత్రి పది గంటలకు అతి రహస్యముగా యేర్పాటు చేయబడినా సభ్యులందరు సాయంత్రము 5 గంటలకే వటవృక్షముక్రింద చేరారు. సభ్యులందరు చేరిన కొద్దిసేపటిలోనే సభ్యులలో విపరీతమైన అభిప్రాయ భేదములు యేర్పడినవి. సమావేశము యే రకమైన దీపములలో నిర్వహించాలనేది కొరుకు వడని ప్రశ్నయైనది. లాంతర్లు యేర్పాటు జేస్తే చాలా బావుంటుందని వెలుగు యెక్కువ దూరము ప్రసరించక రహస్యముగా యుంటుందని యొకవర్గము వారు తమ యభిప్రాయము వెల్లడించారు. సభ్యులలో కొందరు యీ యభిప్రాయమునకు తమ తీవ్రయసమ్మతిని వెల్లడించారు. లాంతర్లకంటె కాగడాలు చాలా మంచివనీ, పోలీసులు యిటు రావడము సంభవించినా కొఱవి దెయ్యాలు అనుకొని పాఱిపోగలరని తమ యభిప్రాయము వ్యక్తం చేసారు. ఇంకొక వర్గమువారు పై రెండు వర్గాల వారిని తీవ్రంగా యెదుర్కొన్నారు. ఆ విధముగా సభ జరిగించటము సభ్యులను, ముఖ్యముగా ఉసేన్‌శాస్త్రిగారిని యవమానపరచటమేననీ, పెట్రొమాక్స్ లైట్లు లేనిదే సభజరుగుటకు వీలులేదని సత్యాగ్రహము చేస్తామని తెలియ చేసారు. చివరకు హుస్సేనుశాస్త్రిగారే కల్పించుకొని వాటన్నిటికంటె యిలాయి బుడ్లు చాలా శ్రేష్ఠమని, అందులో నిజమైన జాతీయత ఉట్టిపడుతుందని, పూర్వము మహారాజుల యిండ్లలోకూడ పెద్ద అవుసరాలకు యిలాయి బుడ్లే విరివిగా యుపయోగపడ్డాయనీ, సీతా వివాహము కొన్ని వేల యిలాయి బుడ్లతో జరిగినట్లు రామాయణము ఘోషిస్తోందని సభ్యులను శాంత పరచారు. చివరకు సభ్యులందరి యనుమతితో సభాలంకరణ యిలాయి బుడ్లతో జరిగినది.

రాత్రి పది గంటలకు యేర్పాటు చేయబడిన సభ "శుభస్యశీఘ్రం" యనునట్లు యెనిమిది గంటలకే ప్రారంభింపబడినది.

సభా ప్రారంభము శ్రీమతి మేరీ యాండాళ్‌గారి "సొగసులాడి చిన్నదిరా, నిన్నెకోరి యున్నదిరా" యనే జావళీతో ప్రారంభమయినది. సభ్యులందరు నిలబడి ముకుళితహస్తులై తమ భక్త్యంజలిని సమర్పించారు. అనంతరం సంఘ శాశ్వత కార్యదర్శి శ్రీ షేక్ జనార్దనంగారు మాట్లాడుతూ శాస్త్రిగారు చిరకాలంగా యేర్పాటు చేయదలచుకున్న సభ ఈ నాడు జరిగినందుకు చాలా సంతోషముగా నున్నదనీ, సంఘ స్థాపకులు, పోషకులూ అయిన శ్రీ శాస్త్రిగారే సభకు యధ్యక్షులుగా యుండటము ఆనంద దాయకమనీ, శ్రీ శాస్త్రిగారికి దేశాటనమంటే చాలా యిష్టమనీ, వారు "కొరియా, అండమాన్స్, నేపాల్, సైబాల్" మున్నగు దేశాలు తెగతిరిగినారనీ, వారికి ఇరాన్‌లో "దేశద్రిమ్మర చక్రవర్తి" యని బిరుదు యిచ్చినారనీ, "గొట్టం" అనే "పెన్‌నేమ్"తో వివిధ పత్రికలలో వ్యాసములు వ్రాయుచున్నది వారేననీ, ప్రస్తుతము వారు బట్టతల స్త్రీల కెందుకురాదో పరిశీలించుచున్నారని, వారికి "మైక్" యక్కఱలేదని వారి గొంతుక పిడుగుకంటె పెద్దదనీ, గోదావరి వంతెన వారు పాడటం మొదలుపెట్టిన వెంటనే "క్రాక్" యిచ్చినదనీ, యీ విధముగా గోదావరి వంతెనకు హాని కలిగించినందుకు వారి మీద "యరెస్టు వారంటు" యున్నదనీ, గానానికి శిలలు ద్రవిస్తాయనే సత్యాన్ని ప్రభుత్వమువారు గుర్తించనందుకు తాను చాలా విచారిస్తున్నాననీ, తాను కాలహరణము చేయక వారిని మాట్లాడమని కోరుతున్నానని విరమించారు.

"గానానికి శిలలు ద్రవిస్తాయి కాని పగలవు" యని నాముందు కూర్చున్న యొక కాలేజి స్టూడెంటు తన శాస్త్ర విజ్ఞానాన్ని ప్రదర్శించాడు. "ముందు పగిలి తరువాత ద్రవిస్తాయి" యని నా ప్రక్క కూర్చున్న వయసు మళ్ళిన శిల్ప శాస్త్ర నిపుణుడు సిద్ధాంతీకరించాడు.

సభ్యుల హాహాకారాల మధ్య హుస్సేన్‌శాస్త్రిగారులేచి "సోదరులారా!" యని యొక్క కేకవేసేసరికి సభ్యులలో చాలా మంది చైతన్యవిహీనులయ్యారు. వారికి తక్షణం ప్రథమ చికిత్స గావింపబడింది. అనంతరం శ్రీ శాస్త్రిగారు తమ యుపన్యాసాన్ని కొనసాగించారు.

"సోదరులారా! మనమంతా మనుష్యులం (హియర్, హియర్, వినుడు

వినుడు అని కేకలు) మీలాటి వీరులందరూ యిచ్చట సమావేశమగుచుండగా పోలీసులకు యీ ప్రాంతాలకు రావటానికి "గుండా చెరువా కొల్లేటి సరస్సా." (హుస్సేన్‌శాస్త్రిగారికి జై, ఓం. మ. క్రి. సంఘానికి జై యని కేకలు) నేను చెప్పబోవునది మీరు సావధానంగా, జాగ్రత్తగా వినవలసి వుంటుంది. లేనియెడల మీకు అర్థం కాదు. ఒక్కొక్క సమయములో నాకే యర్థము కాదు. (సైలెన్స్, నిశ్శబ్దము, ఛుప్రహో యని కేకలు) మీలాంటి బుద్ధిమంతులనందరిని యిక్కడ చూచినందుకు నాకు చాలా సంతోషముగా నున్నది. సభ కొల్లేటి ప్రాంతములో జరుపబడటం చాలా ఆనందదాయకము. కొల్లేరు ఒకప్పుడు మహాపట్టణమని ముసలమ్మలు చెబుతూ వుంటారు. కొల్లేటి దోమలే జగత్ప్రసిద్ధిజెందుచుండగా యీనాటి జనుల సంస్కృతి చాలా గొప్పదని నా సదుద్దేశము. నా భావముతో మీరు యేకీభవిస్తారని తలుస్తాను. (నిస్సంశయముగా అని కేకలు) మీకు చదువు తక్కువ అయినా సంస్కారమున్న వారిలా కనబడుతున్నారు. ముందు ముఖ్యముగా మూడే యక్షరములు గల మన సంఘము పేరును గురించి చెబుతాను. "మూడు" సంఖ్య చాలా విశేషము గలది. భర్త భార్యకు వివాహ సమయములో మూడుముళ్ళు వేస్తాడు. భారతదేశము మూడు ముక్కలై స్వతంత్రమైనది. నేడు ప్రపంచములో బలము గల పెద్ద రాజ్యాలు మూడు. ప్రస్తుతము మనకు దొరికే వేదాలు మూడే. ప్రామిసరీనోటు మూడు సంవత్సరాలకు కాలదోషము పడుతుంది. పాత నాణాలు, కొత్త నయాపైసలు కలసి మూడేళ్లు చెలామణిలో వుంటాయి. ఈ విధముగా చెప్పుకుపోతే ప్రపంచమంతా మూడు మయమని నిరూపించవచ్చు. హిందూ మతములోని "ఓం"కారము మన సంఘముయొక్క ప్రథమాక్షరముగా నిర్ణయింపబడినది. తరువాత భారతదేశము వచ్చిన మహమ్మదీయ మతములోని మొదటి యక్షరమే రెండవ యక్షరము. చివరగా భారతదేశము ప్రవేశించిన క్రీస్తుమతములోని ప్రథమాక్షరమే చివరి యక్షరము. మన సంఘముయొక్క ప్రధానాశయములు అన్ని మతాలకు సఖ్యమేర్పడుటయే. అందుచేతనే మన సంఘ సభ్యులందరు తమ పేర్లలో మహమ్మదీయ పేరును గాని, క్రిష్టియను పేరునుగాని చేర్చుకోవాలి. మన పేరులోనేవున్న మత సామరస్యాన్ని ప్రజలు గుర్తించాలి. తమ పేర్లను యిది వరకే మార్చుకొనివున్న శ్రీ షేక్ జనార్దనం, రఫీ రామారావు, జాన్ వెంకటేశ్వర్లు, పీటర్ పార్వతీశం, మేరీ ఆండాళ్ గార్లకు నా అభివందనములు. మన సంఘముయొక్క ఆదర్శ, ఆశయ విస్తరణకు త్రైవర్ణ ప్రణాళికను ప్రవేశపెట్టబోవుచున్నాను. అంతవరకు సభ్యులందరు భావ ప్రపంచములో వోలలాడవలసివుంటుంది. మన సంఘ వ్యాప్తికై నేను త్వరలోనే "కొరకంచు" యనే పత్రికను స్థాపింపబోవుచున్నాను ఈ పత్రిక మతోన్మాదులకు కొరకంచు. అవినీతి పరులకు కొరకంచు. మన సంఘ శత్రువులకు కొరకంచు. పోలీసులకు కొరకంచు. మీ రందరు తీరిక సమయాలలో గంటము చేతపుచ్చుకోవాలి. (గంటమేమిటని కేకలు) సోదరులారా! అదే మనవిచేయబోవుచున్నాను. మన చేతిలో గంటము నిలచియున్నంత కాలము మన సంస్కృతి అత్యున్నత దశలో వృద్ధిపొందుచు వచ్చినది. ఏనాడు మనము గంటాన్ని విసర్జించితియో యానాడే మన సంస్కృతి మనలను విడనాడినది. తిరిగి భారత సంస్కృతిని మనము పునరుద్ధరించదలచుకుంటే గంటాన్ని చేత ధరించటము చాలా అవసరము. కాగితానికి విపరీతమైన ధర, అచ్చు ఖర్చులు మొదలగునవి చాలా ఉన్నవి. ఒక చోట నిలకడలేని మనకు యీ బాధ్యత చాలా కష్టసాధ్యము. ఏ మాత్రము ఖర్చులేని గంటము, తాటాకులే మనకు శరణ్యము. సంఘ సభ్యులందరు యిందులో చందాదారులుగా చేరాలి. సభ్యుల చందా తాటాకు రూపంలో వుంటుంది. మన సంఘానికి కొంత యార్థిక పటిష్ఠత చేకూరాలంటే సభ్యుల నుంచి కొంత చందా వసూలు చెయ్యవలసి వుంటుంది. ప్రస్తుతము నిర్ణయించిన చందా ఎఱ్ఱగా వున్నవారికి పావలా నల్లగా వున్నవారికి బేడ. (నల్లగా వున్న వారికి చందా యెందుకు తక్కువో అర్థం కావటంలేదు యని కేకలు) సోదరులారా! నలుపులోవున్న నాణ్యం మీకేమి తెలుసు. పదహారువేలమంది గోపికలను వలచి వలపింపజేసిన శ్రీకృష్ణపరమాత్ముడు "నల్లనివాడు పద్మనయంబులవాడు" యన్నాడు వేమన. ఇతడే నిజమైన కవి; జాతీయకవి; ప్రజాకవి. నలుపు యెఱుపుల తారతమ్యం మన సంఘము నిర్మూలించాలి. నల్లగా వున్నవారు చాలా హీనముగా చూడబడుతున్నారు. దక్షిణాఫ్రికాలో నల్లవారు అనేక విధములుగ బాధపడుతున్న విషయం మీకు తెలిసినదే. ప్రపంచములో యే ప్రాంతములోనైనా ప్రజల మధ్య ఐకమత్యముచెడి కల్లోలములు ప్రారంభమైన వెంటనే మన సంఘ సభ్యులు అక్కడకుబోయి వారిలో కలతలు నిర్మూలించాలి. కొరియాలో యుద్ధము ప్రారంభమైన వెంటనే రఫీ రామారావుగారు కొరియా భాష నేర్చుకోవడం ప్రారంభించారు. ఇప్పుడు వారు అఖండమైన పాండిత్యము సంపాదించి కొరియా భాషలో యష్టావధాన, శవావధాన, యాశుకవిత్వాదులు చేయగల సమర్థులైనారు. వారికి నా కృతజ్ఞత (రఫీ రామారావుగారికి జేజే యని కేకలు) త్వరలోనే జాన్ వెంకటేశ్వర్లు

గార్లు జోర్డాన్‌కు, పీటర్‌పార్వతీశంగారు దక్షిణాఫ్రికాకు వెడలబోవుచున్నారు. (వారిద్దరకూ జే యని కేకలు) వారి ప్రయత్నము ఫలవంతమగునట్లు దైవాన్ని ప్రార్థించాలి. (సభ్యులు కొంత సేపు దైవధ్యానము చేస్తారు.)

సోదరులారా! తీర్మానాలు ప్రవేశపెట్ట బడుతున్నవి. ఆమోదించినవారు తల లాడించాలి.

**1.** దున్నేవారిదే భూమి యనే విధముగా వుతికేవారివే బట్టలనేచట్టాన్ని గవర్నమెంటువారు ప్రవేశపెట్టరాదు.

**2.** సమిష్టి చాకి రేవుల నిర్వహణను యీ సంఘమువారు అన్ని పరిస్థితుల లోను వ్యతిరేకిస్తున్నారు.

3. మంగలిపనిని గవర్నమెంటు వారు యే పరిస్థితులలోను జాతీయం చేయరాదు:

4. బట్టతల స్త్రీలకు యెందుకురాదో పరిశోధించుచున్న శ్రీ హుస్సేన్ శాస్త్రి గారికి ప్రజలంతా సహాయపడాలి. శాస్త్రీయ పద్దతులపై జరుగవలసిన యీ పరిశోధనకు కావలసిన ముడి పదార్థాలన్ని విదేశాలనుంచి దిగుమతి చేయించాలి. ఇందుకయే ఖర్చును సభ్యులందరు భరించాలి.

5. సభ్యులందరూ పిలక ధరించి మీసములు లేకుండా గడ్డములు పెంచవలయును. మెడలో క్రాసును కూడా ధరించుట వుత్తమము. గళ్ళ లుంగి ధరించి బ్రహ్మదండము ధరించుట చాలా శ్రేష్ఠము. ఈ విధముగా నభ్యుదయ భావములుగల సభ్యులను సంఘమన్ని విధముల ప్రోత్సహించుతుంది.

శ్రీ షేక్ జనార్దనంగారు హడావిడిగా ప్రవేశించి హుస్సేన్ శాస్త్రిగారితో రహస్యముగా యేదో చెపుతారు. శాస్త్రిగారు తొందరగాలేచి "నేను కొంతకాలము వరకు ప్రచ్ఛన్నముగా నుండుటకే నిర్ణయించుకున్నాను. తిరిగి రాబోవు మహాసభ షష్ఠినాడు పాపికొండలలో జరుగుతుంది. సభ్యులందరూ దయచేయవలయును." శాస్త్రిగారు తృటికాలములో క్రిందకు లంఘించి చీకటిలో యంతర్ధానమయ్యారు. 'పోలీసులు పోలీసులు' సభ్యులందరూ కొల్లేటి జమ్ములో కలసిపోయారు. క్షణకాలములో నేను, నాకు కొంచెము వెనుక యింకొక స్థూలకాయుడు మిగిలాము బిలబిలలాడుతు పదిమంది పోలీసులు ప్రవేశించి స్థూలకాయునకు సెల్యూట్‌చేసారు తొందరగా పోలీసులు నాదగ్గరకు వచ్చారు. నాదగ్గర వున్న హేండ్‌బాగ్‌లోంచి ఒక కార్డు తీసి చూపించాను. స్థూలకాయుడు నా దగ్గరకువచ్చి "సారి" యన్నాడు. "మీరు యినస్పెక్టరా చూస్తూ ఊరుకున్నారే" యన్నాను. 'బ్లాక్ హెడ్' యని యొక్క తోపు కటాక్షించాడు. ఆ తోపుతో క్రింద పడ్డాను. లేచిచూచేటప్పటికి మంచం క్రింద ఉన్నాను. ★


# సిప్లినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు: మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంథి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును.

20 పూటలమందు రూ. 3=50 న.పై.

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376, మద్రాసు-1.


# నమ్మకం

రచన: సియ్యాద్రి గురుమూర్తి

*

కార్డు కథలు పంపుతూ చిత్రగుప్తను బహుమతిగా పొందటం నా మిత్రులందరకూ విదితమే. ఎప్పుడూ కార్డు కథలేనా ఏమిటి పెద్ద కథలు వ్రాయమని మిత్రులు ప్రోత్సహించారు. ఎలా అయితేనేమి మొన్న నొక కథ వ్రాసాను. అది ప్రచురింపబడింది. పత్రిక ఒకటి చేతికందింది. మిత్రులంతా వేంచేసారు కథ ఎలా ఉన్నా వారు చెప్పినట్లు పెద్ద కథ వ్రాసినందుకు సంతోషించారు. ఏంరా భాయీ ఈ కథకు ఎంత ముట్టింది ప్రశ్నించాడొక మిత్రుడు ఆ ఏముంది ఇదుగో మామూలే చూపించాను ముడతలు పడి వున్న పత్రికను. వీడు తప్పించుకుందామన్నా మన దగ్గర సాగదు. సాయంకాలం గ్రాండు హోటల్ అన్నాడు మరొక మిత్రుడు. అదేమిట్రా సినీమాకు వెళ్తే బాగుంటుంది అన్నాడు మొదటివాడు. ఏమిట్రా మీ రనేది! నా ప్రశ్న. కార్డు కథలకే పత్రిక వచ్చేటప్పుడు పెద్ద కథలకు ఏమైనా డబ్బు రాకుండా ఉంటుందాఅని. నిజంరా బ్రదర్ ఒక్క కాని...అని అంటుండగనే దబాయించారు ఇద్దరున్నూ. ఎందుకురా అబద్దాలు. అని సరే నామాటమీద మీకు నమ్మకం లేనప్పుడు ఇదిగో ఈ రిప్లయి కార్డు ఇప్పుడే వ్రాస్తున్నాను. దానికి జవాబు వచ్చినప్పుడన్నా మీరు నమ్మకపోరు. అని వెంటనే ఓ రిప్లయి కార్డు వ్రాసి పోస్టు చేసా. సరే ననుకుంటూ వెళ్లిపోయారు. మూడురోజులు పోయాక మళ్లీ వచ్చారు. ఏమని చెప్పను అసలు జవాబు వస్తేగా.

ఏమయిందిరా! మిత్రుల ప్రశ్న. జవాబులేదు బ్రదర్ నా సమాధానం. ఏమనుకున్నారో ఏమో అలా షికారుకన్నా పోదాం పద. కూర్చున్నవాడ్ని లేవదీసారు. వారికి నా యందు నమ్మకం కుదిరినట్టు లేదు.

★